# బాబాయ్ .....ఈసారికి ఇలా కానియ్ !
## ( హాస్య నాటిక )

- శంకరమంచి పార్థసారథి

పాత్రలు

దుర్గారావు

గోవిందరాజులు

ఫాతిమా

కామాక్షి

సలీం

రమణ

శివశంకర శాస్త్రి

ఖాన్

# బాబాయ్ .....ఈసారికి ఇలా కానియ్ !
## ( హాస్య నాటిక )

- శంకరమంచి పార్థసారథి

( తెర లేచేసరికి – రెండు పోర్షన్లు కనిపిస్తున్నాయి. ఒకటి ఇంటి వోనరు గోవిందరాజులు నివాసం – ప్రక్క పోర్షను ప్రస్తుతం ఖాళీ. రెండు పోర్షన్లు ముందు ఖాళీ వసారా – లోపలికి రావటానికి ఓ వైపు ద్వారం వుంది. ఎడమ వైపు ద్వారం – కామన్ బాత్‌రూం– లెట్రిన్ వగైరాలకు ప్రవేశం.

తెర తీయగానే దుర్గారావు బయటినుంచి లోపలకు వచ్చాడు. ఎవరూ కనిపించక – ఏంచెయ్యాలో తోచక క్షణం సందిగ్గం. అక్కడేకాస్సేపు తచ్చాడి – గోవిందరాజుల పోర్షన్ గుమ్మం దగ్గరకు వచ్చి.

దుర్గారావు : ఎవరండి లోపల ? మిమ్మల్నే !

గోవిందరాజులు : ఎవరూ ? నువ్వురా ? పరాయివాడిలా ఆ పిలుపేంటి ? బయట నిబడ్డావేమిటి ? లోపలికి రావచ్చుగా....

దుర్గారావు : రాను. ఎలా రాగలను ? మా అక్కనుంచి విడాకులు కావాలని ఏరోజైతే కోర్టుకి ఎక్కావో, ఆ రోజునుంచి మనమధ్య రిలేషన్ రద్దయిపోయింది. ఇప్పుడు కేవలం నేను దుర్గారావుని, నువ్వు గోవిందరాజులివి. అంతే !

గోవిందరాజు : అంత కోపం దేనికిరా ? నిర్మల మొగుడికి మల్లే ! ...అతనూ అంతే ....

దుర్గారావు : ప్లీజ్ ! నన్ను రా, గీ అని పిలవద్దు గివ్ రెస్పెక్ట్ అండ్ టేక్ రెస్పెక్ట్. ఇంతకీ అర్జెంటుగా రమ్మన్నావట....త్వరగా చెప్పేస్తే నే వెళ్ళాలి... అర్జెంటు పనులున్నాయ్.

గోవిందరాజులు : అదా ! మీ అక్కని ఓసారి తీసుకువస్తే, నేను తను కలిసి ఫోటో తీయించుకోవాలి.

దుర్గారావు : జాయింటుగా ఫోటోనా ? నీతో ? అయినా దేనికటా ?

( ఫాతిమా వచ్చింది. బుర్ఖా వేసుకుంది. రాగానే వాళ్ళ పద్దతిలో విష్ చేసింది )

ఫాతిమా : ఆదాబ్ సాబ్ !

గోవిందరాజులు : నమస్కారం. నమస్కారం.... రాత్రి రాలేదేం . అదే నిన్న సాయంత్రం రాలేదే. నీకేదయిన ప్రాబ్లం వుండి రాలేకపోతే ఫోన్ చేసి చెప్పాలి. అర్ధవయిందా ?

ఫాతిమా : బిడ్డకి బీమారయింది. దవఖానాకి తోలుకుపోయినా.....

గోవిందరాజులు : సరే సరే వెళ్ళు...నీ భాష నాకు రాదు. నా బాష నీకు తెలీదు.

దుర్గారావు : నీకు బాషలతో పనేం వుందిలే !

గోవిందరాజులు : అది పనిమనిషి, సర్వెంట్‌మెయిడ్. ఇబ్బందుల్లో ఉన్నానని గోల పెడితే పోనీలే పాపం అని....

దుర్గారావు : అంత చెప్పక్కర్లా...సెటప్పు అర్ధమయింది. అప్పుడు లేని పనిమనిషి ఇప్పుడొచ్చిందంటే...

గోవిందరాజులు : అప్పుడు మీ అక్క ఉండేదిగా.

దుర్గారావు : అదే నే చెప్తున్నది కూడా....

( అంతలో ఫాతిమా భర్త సలీం అక్కడికి వచ్చాడు. ఆటో డ్రయివరు కావడంచేత ఖాకీ షర్టు వేసుకున్నాడు. రాగానే గోవిందరాజులుని విష్ చేసి భార్య దగ్గరకి వెళ్ళాడు )

సలీం : బచ్చేకో స్కూల్ చోడ్కె ఆరూం.... పోలీస్ వాలే పకడ్లియా. పైసేహైతో దేవ్....

ఫాతిమా : మేరే పాస్ నహిహై....

సలీం : యైసేకౌసా....రాత్ మే పైసా మార్ దియానా... నికాలో....

ఫాతిమా : అరే....ఛోడో... మేరే పాస్ నహీహై బోలానా.....

( తప్పించుకుని వెళ్ళిపోయింది. సలీం ఆమె వెంటే లోపలికి ఫాలో అయ్యాడు. గోవిందరాజులు కంగారుగా .....)

గోవిందరాజులు : ఇదిగో నీ పేరేంటో .... ఏయ్...నిన్నే ..ఆగు....

దుర్గారావు : ఆగమంటే ఆగటానికి అదేం మా అక్క కాదు.

గోవిందరాజులు : అబ్బో.... అక్క...దాని గురించి నాకు చెప్పకు...అక్క కాపురం బావదగ్గరా అని... పదేళ్ళు వేపుకుతింది. నిల్చుంటే అనుమానం... కూర్చుంటే అనుమానం...త్వరగా వచ్చినా అనుమానం... ఆలస్యంగా వచ్చినా అనుమానం ఛీఛీ....

దుర్గారావు : గుండెమీద చెయ్యి వేసుకుని చెప్పు. నీకు ఆ వీక్నెస్ లేదా ?

( గోవిందరాజులు గుండె మీద చెయ్యి వేసుకోబోయి ఆగాగు )

దుర్గారావు : వూ...ఆగావేం ? దేనికో ఆలోచన

గోవింరాజులు : చెయ్యి బాగాలేదు. కడుక్కొద్దామని ... ( సలీం వచ్చాడు )

సలీం : సాబ్ ! ఫాతిమా పిలుస్తోంది.

గోవిందరాజులు : దేనికి పైసలడగటానికా ? నేనివ్వను ....మీకేం తమాషాగా ఉందా ? నే కరెక్టు మనిషిని ...నా దగ్గర కుదరవ్...

( లోపలికి వెళ్ళాడు. సలీం బీడీ తీసాడు )

సలీం : కాం హోజాతా ! సాబ్ అచ్ఛా ఆద్మీహై.....

( దుర్గారావు జేబులోంచి సెల్‌ఫోన్ తీసి నెంబర్ డయల్ చేసి )

దుర్గారావు : లాయర్‌గారూ.... నే దుర్గారావుని. మా బావ అక్కయ్యతో ఫోటో దిగాలని అంటున్నాడు....కారణం చెప్టంలా.... దేనికంటారూ ?

( అంటూ వెళ్ళాడు. ఇంతలో ముందు గోవిందరాజులు ఆ వెనకనే సిగ్గుపడుతూ ఫాతిమా వచ్చారు. అక్కడ దుర్గారావు కనిపించక పోవటంతో .....)

గోవిందరాజులు : వీడేడి ? వెళ్ళిపోయాడా ?

సలీం : బయటికి వెళ్ళుంటాడు.....

( ఫాతిమా సలీంకి డబ్బులు ఇస్తుండగా దుర్గారావు లోపలికి వచ్చాడు )

ఫాతిమా : యేలో... శాంతక్ మేరా పైసా వాపస్ దేనా .....

సలీం : టీక్ హై....షుక్రియా సాబ్ !

( సలీం వెళ్ళి పోయాడు. ఫాతిమా లోపలికి వెళ్ళిపోయింది )

గోవిందరాజులు : పాపం... పూర్ ఫెల్లోస్...కాస్త కాఫీ తాగుతావా...ఫాతిమా టీ బాగా కాస్తుంది....

దుర్గారావు : ఏం అక్కర్లా...నే వెళుతున్నా...

గోవిందరాజులు : మరి....

దుర్గారావు : ఫోటో గురించా ? ....సారీ ! ...విడాకులు గురించి కోర్టుకు ఎక్కిన వాడికి ఫోటోలు, ఆటోగ్రాఫులు ఎవరూ ఇవ్వరు...

గోవిందరాజులు : సరే... పాతికవేలు క్యాష్ ఇస్తా....

దుర్గారావు : నీకు మనుషుల రేట్లే గాని విలువ తెలియదు. నీ పెన్షన్ ఆగిపోయింది. ఈ జాయింటు ఫోటో పెడితేగాని పెన్షన్ రిలీజుకాదు. అవునా.....

గోవిందరాజులు : అవును. నాతో కోపరేట్ చేసి ఫోటో దిగితే నా తర్వాత తనకి ప్రతి నెలా పెన్షన్ వస్తుంది. డైవర్స్ శాంక్షన్ అయినా తనకే ఇమ్మని రాసిస్తా....

దుర్గారావు : నీ తరువాత.. పాపి చిరాయువు అని... అప్పటిదాకా గాలి తిని బలకాలా ? ..

గోవిందరాజులు : సరే....నా తరపునుంచి ఆఖరు చెప్తున్నా.... యాభయివేలు క్యాషిస్త... ప్రతినెలా అయిదువందలిస్తా... నే పోయాక ఎలాగు పెన్షన్ వస్తుంది.

దుర్గారావు : పదిహేనేళ్ళు కాపురం చేసి యాభయ్ వేలు తీసుకోవటం కన్నా...ఏ బస్సు ప్రమాదంలోనో పోయుంటే ప్రభుత్వం లక్ష రూపాయిలిచ్చేది....

గోవిందరాజులు : పోనీ ఇది కూడా చిన్న ప్రమాదం అనుకో....చనిపోలేదు....గాయపడ్డాం అనుకోమను.

దుర్గారావు : ఆర్గ్యుమెంట్స్ అనవసరం... వస్తా... కానీ ఒక్కమాట...మాకు వెనకా ముందూ ఎవ్వరూ లేరనుకుంటునా్రవేమో ? స్నేహాలు, పరిచయాలు మాకూ వున్నాయి. ఇలా చిటికేస్తే....

( సరిగ్గా అప్పుడే రమణ అక్కడిక వచ్చాడు. అతడ్ని చూసి అక్కడున్న ఇద్దరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు )

రమణ : గుడ్ మార్నింగ్ సర్ !

గోవిందరాజులు : ఓహో అర్థమైంది.

దుర్గారావు : అర్ధమైందీ కాదు.... అర్ధమైందా ? అనాలి.

రమణ : ఆగండి...ఆగండి ...ఇక్కడేదో కమ్యూనికేషన్ గ్యాప్ వర్క్ అవుట్ అవుతుందని డౌట్‌గా వుంది. నా పేరు రమణ, ఇంటిపేరు విష్ణు భట్ల, అంటే వి.డాట్ రమణ. బయట టులెట్ బోర్డ్ చూసి సరాసరి లోపలికొచ్చా.

దుర్గారావు : అలాగా ! సారీ నా పేరు దుర్గారావు.

రమణ : సారీ దేనికండి.... పేరు బాగానే వుందిగా ....మీరు...

గోవిందరాజులు : గోవిందరాజులు

దుర్గారావు : గురివింద రాజులు అని కూడా అంటూ వుంటారు.

గోవిందరాజులు : ఎవడా అనేది ? ... చెప్పు తీసుకుని కొడతా

( ఇంతలో ఫాతిమా వచ్చింది. ఆమెని ఓనర్ భార్య అనుకుని గౌరవంగా ...)

రమణ : గుడ్ మార్నింగ్ మేడమ్, సార్ వున్నారా ?

గోవిందరాజులు : సారా ? వాడెవడు ?

రమణ : ఇంటి ఓనర్ !

గోవిందరాజులు : ఇంటి ఓనర్ని నేనే

రమణ : మీరే అనుకున్నాను కాని, డౌటు వచ్చి అడిగా...ఇదేనా ఇల్లు ?

గోవిందరాజులు : లేదు. లోపల ఇంకొకటి వుంది.

దుర్గారావు : ఈ ఇల్లు మా అక్కది.

రమణ : అక్కది, అంటే మీరూ ? ఓహో అదా మేటరూ గుడ్ మార్నింగ్ మేడమ్. ఐయామ్ రమణ, వి డాట్ రమణ.

గోవిందరాజులు : ఆపవయ్యా ...ఏంట్రా ఈ ఇల్లు మీ అక్కదా ? అరటి తొక్కేంకాదూ ? మర్యాదగా బయటికి నడు.

దుర్గారావు : నడవక ఇక్కడే శిబిరాలు కట్టుకుని సెటిలైపోము. కాని ఒక్కమాట, ఈ రోజునుంచి నిన్ను వెన్నంటి వెంటాడి ఆధారాలు సంపాదించి నీ బతుకు బజారుకి ఈడ్చకపోతే నా పేరు దుర్గారావే కాదు

( దుర్గారావు ఆవేశంగా బయటికి వెళ్ళిపోయాడు )

రమణ : మీ బావమరిది ఆంగ్రీ యంగ్మాన్, అమితాబచ్చన్ టైపులా వుంది.

గోవిందరాజులు : కుర్రకుంక. ఏ మాటకామాటే చెప్పుకోవాలి, వాడి సిస్టర్ చాలా నెమ్మదస్తురాలు.

రమణ : ( ఫాతిమాని చూస్తూ ...) చూస్తే తెలియడంలా.... మొహంలో ఏం కళ....

గోవిందరాజులు : ఎవరి మొహంలో ?

రమణ : ఆఫ్కోర్స్...మీ ఫేస్ ఏమీ తీసిపోదు. ఫోకస్ లైటంత బ్రైటు. =

గోవిందరాజులు : సరే... సరే... ఇంతకీ నీ పేరేంటన్నావ్ ? రమణా ?

రమణ : వి డాట్ రమణ.

గోవిందరాజులు : ఏం చేస్తుంటావ్ ?

రమణ : ఈ ప్రశ్నకి సమాధానం ఇవ్వాలంటే బాగా వెనక్కి వెళ్ళాలి

( గోవిందరాజులు అనుమానంగా రెండు అడుగులు వెనక్కి వేసాడు )

రమణ : ఆ వెళ్ళటం కాదూ... నే కడుపున పడంగానే దివిసీమలో ఉప్పెనొచ్చి ఊడ్చిపెట్టుకుపోయిందిట.

గోవిందరాజులు : నాకు చాలా పనులున్నాయి. త్వరగా కాస్త ముందుకు వచ్చి చెప్పు.

రమణ : సారీ !.... మీకు చెవుడా ?

గోవింరాజులు : అది కాదయ్యా ...నువ్వు ఎప్పుడు గర్భాన ఏడ్చావ్, మీ అమ్మ డోకుల గురించి, పురుడు పోసిన మంత్రసాని గురించి, ఈ వివరాలు కాకుండా.... ఏం చదివావ్, ఏం ఉద్యోగం. శాలరి ఎంత ? పెళ్ళైందా ఇవి చెప్పు చాలు.

రమణ : ఓ.కే.బి.ఎ చదివా, చిన్నప్పటినుంచి ఫోటోగ్రఫీ అంటే పిచ్చి. అందులో ట్రిక్ ఫోటోగ్రఫీ అంటే ప్రాణం. స్కూల్ రోజుల్నించి కూడా కెమెరాతో ప్రయోగాలు చేస్తుండేవాడ్ని . ఒకసారి మా ఇంటి పక్కన ఉండే తులశమ్మ గార్ని వాళ్ళింట్లో పాలు పోసే వాడ్ని కలిపి వాళ్ళకి తెలియకుండా ఫోటో తీసా....

గోవిందరాజులు : అప్పుడేమైంది ? ఏమైంది ? ఆవిడ మొగుడు నిన్ను చితకబాదాడా ?

రమణ : లేదు. అదే విచిత్రం, పైగా పిలిచి రహస్యంగా ఒరే రమణా నన్నూ మా పనిమినిషిని కూడా ఇలా ఫోటో తీయవా... అని అడిగాడు.

గోవిందరాజులు : పనిమనిషా .....రహస్యంగా ...తీసావా...

రమణ : సారీ...ఏదేదో వాగేసి బోరుకొడుతున్నానా ?

గోవిందరాజులు : బోర్‌లేదు గీర్ లేదు... తీసావా ? చెప్పు...

రమణ : ఎందుకు తియ్యనండీ...ఎవరడిగినా తీస్తా... దటీస్ మై జాబ్ అండ్ డ్యూటీ... అంత ఇంట్రస్టు కాబట్టే చదువయ్యాక ఫోటో స్టూడియో పెట్టా. సూపర్ ఫ్లాప్. లక్షలాస్.

గోవిందరాజులు : కాదు మరి. ట్రిక్స్ లేకుండా బిజినెస్‌లో సక్సెస్ కాలేం.

రమణ : స్టూడియో మూసేసి, కెమెరాలన్ని అమ్ముకుని ఈ ఊరొచ్చా. లక్కీగా చిన్న జాబ్ దొరికింది. మీరు పోర్షన్ అద్దెకిచ్చారంటే, ఫ్లాష్ లేని కెమెరాలగా పడుంటా. ఏంటాలోచిస్తున్నారూ ?

గోవిందరాజులు : అవునూ...నీకు పెళ్ళైందా ...??

రమణ : ఈ విషయం అడగటానికి అంత ఆలోచన దేనికండీ ? నేనే అంతసేపు ఆలోచించలేదు...పెళ్ళైనవాళ్ళకి తప్ప సింగిల్ గాళ్ళకి పోర్షన్స్ అద్దెకి దొరకవని తెలిసి... డార్లింగ్ ...కమాన్...ఇలా వచ్చి ఓనర్ గార్ని తృప్తి పరుచు.

గోవిందరాజులు : థాంక్స్ అయ్యా....డబుల్ మీనింగ్ లేదుగా.

రమణ : నో...నో...సింగిల్ మీనింగే...

( అంతలో కామాక్షి లోపలికి వచ్చింది కళ్ళకి జోడు హ్యాండుబాగు తిప్పుకుంటూ నిర్లక్ష్యంగా వచ్చింది. ఆమెని చూడగానే గోవిందరాజులు షాక్ అయ్యాడు. మొహం పక్కకి తిప్పేసాడు. కామాక్షి ఇంటిని పరీక్షగా చూస్తూ ....)

కామాక్షి : ఈ హౌసా ?

రమణ : ఏం బాగాలేదా ? నాకు చాలు. వీరే హౌసు ఓనర్ గోవిందరాజులు గారని

కామాక్షి : పంగనామాలు పెట్టేరకం....

రమణ : నా వైఫే సార్.... పేరు కామాక్షి...

గోవిందరాజులు : అలాగా ! వెళ్ళి పోర్షను చూసుకోమాను...

కామాక్షి : చూసుకునేంత పోర్షన్ ఏం వుందని ? ఇంతేగా !

రమణ : కామాక్షికి నేనెంత చెపితే అంత. పోర్షన్ న్నే చూసుకుని అదే ! చూసి, సార్‌తో మాట్లాడి ఓకే అనిపించుకొని వస్తాగానీ నువ్వు మార్కెట్లో కాయగూరలు తీసుకుని ఇంటికివెళ్ళు. ఒక గంటలో వచ్చి కలుస్తా. అదే...ఇంటికొస్తా....బై...బై...

కామాక్షి : మరి పేమెంట్ మాటేమిటి ?

గోవిందరాజులు : పేమెంటా ?

రమణ : ఓహో...కాయగూరల డబ్బులా....( పర్సులోంచి నోట్లకట్ట తీసి ఇచ్చాడు ) ఇందాక అడ్వాన్స్ 500, ఇది వెయ్యి ఓకే

గోవిందరాజులు : ఏంటీ ! కాయగూరలకే ? బజినెస్సా...

కామాక్షి : ఏం తెలీనట్టు ...( ఒక నోటు తీసిచ్చేస్తూ ....) ఇదేంటీ ...నలిగిపోయిన లోపల లంగా లాగా.... వేరే ఇవ్వు...

రమణ : ఏంటి కామాక్షీ ....మరి కమర్షియల్ కామాక్షిలాగా...సార్ ఏం అనుకుంటారు ( వేరే నోటు ఇచ్చి ) ఓ.కే.జాగ్రత్తా....థాంక్యూ

( కామాక్షి గోవిందరాజుల వంక గుర్రుగా చూసుకుంటూ వెళ్ళిపోయింది )

గోవిందరాజులు : వి.రమణా...

రమణ : కాదండి. సీన్ అయిపోయిందిగా ...నిష్క్రమణ.

గోవిందరాజులు : అది కాదయ్యా...అసలూ...పిల్లలా ?

రమణ : నాకా లేరండి....

గోవిందరాజులు : ఎలా ఉంటారూ ?

రమణ : పిల్లలు లేరండీ అంటే ఎలా వుంటారు అని అడుగుతారేంటి ? అంకుల్ జోక్ చేస్తున్నారు. సరే నే వెళ్ళి పోర్షన్ చూసొస్తా....( రమణ పక్క పోర్షన్‌లోకి వెళ్ళాడు )

గోవిందరాజులు : ( ఆ వైపుగా చూస్తూ ) ఆ కామాక్షి బజారు మనిషి. ఈ రమణ అన్నీ తెలిసే చేసుకున్నాడా ? లేక అమాయకుడ్ని చేసి మోసం చేసిందా...

( అనుకుంటూ వెనక్కి తిరిగేసరికి అక్కడ కామాక్షి నిలబడివుంది. గోవిందరాజులు కంగారు పడ్డాడు )

గోవిందరాజులు : గుర్తున్నాన్నా ? మనం కల్సుసకుని ఏడాది కావస్తోంది. అవునూ .... పెళ్ళయి ఎన్నాళ్ళయింది ?

కామాక్షి : ఆ రోజు ఆటో ఎక్కించి పైసలిచ్చేసానని చెప్పావ్ ?

గోవిందరాజులు : ఆటోనా ? పైసలా ? ఆటోవాడు అబద్ధం చెప్తుంటాడు. ఇప్పుడిస్తాలే...

( జేబులోంచి నోటు తీసి ఇస్తుండగా ఫాతిమా లోపలినుంచి అక్కడికి వచ్చింది. చేతిలో బుర్ఖా వుంది )

ఫాతిమా : కాంహోగయా సాబ్ ....మైజారుం

( కామాక్షి, ఫాతిమా ఒకరినొకరు చూసుకున్నారు )

గోవిందరాజులు : ఫాతిమా అని మా పనిమనిషి, కామాక్షిగారని ఈ పోర్షనులోకి వస్తున్నారు.

( ఫాతిమా బుర్ఖా పుచ్చుకుని బయటికి వెళ్ళిపోయింది )

కామాక్షి : అంటే పర్మినెంట్ సెటప్పన్నమాట.

గోవిందరాజులు : ఛీఛీ...అదేం లేదు...ఇంకా పనిమినిషే !

( రమణ అక్కడికి వచ్చాడు. కామాక్షిని చూసి అర్ధంకాక....)

రమణ : అదేంటి మళ్ళీ వచ్చావ్ ?....

గోవిందరాజులు : అదే వాటర్ టైమింగ్స్, పనిమనిషి డిటైల్సు తెలుసుకుందామని వచ్చింది. రమణా నువ్వు మనిషివి కాదయ్యా ! వెరీ వెరీ గ్రేట్ ...నీలో రాజారామ్మోహన్ రాయ్, కందుకూరి, గుడిపాటి, గురజాడ అందరూ కనిపిస్తున్నారయ్యా..

రమణ :( అనుమానంగా కామాక్షితో ....) ఆ విషయం చెప్పేసావా ....?

గోవిందరాజులు : ఏ విషయం ?

రమణ : పనిమనిషి విషయం

గోవిందరాజులు : పనిమనిషేంటి ?

కామాక్షి : అబ్బా.... పెద్దాయన ఎంత అమాయకుడో .....

రమణ : అవునూ. చాలా మంచివారు. టెనెంట్లో చరిత్రకారుల్ని, పురాణ పురుషుల్ని చూసుకునే టైపు....

కామాక్షి : సరే ! నేవెడుతున్నా.....సారీ డైలాగు మర్చిపోయా....ఏవండీ త్వరగా ఇంటికి రండి...అసలే మీకు చలిగాలి పడదు. ఇంతేగా....

రమణ : అంతే అంతే ,..... బై కామాక్షీ....

కామాక్షి : టాటా ( కన్నుకొట్టి వెళ్ళిపోయింది )

రమణ : ( కంగారుగా ) ఈ లేడీస్‌తో ఇదే ప్రాబ్లం....

గోవిందరాజులు : ఇలాంటి లేడీస్‌తో మరీను.... వాళ్ళకి కొత్త గదా !....

రమణ : నాకేం రొటీనా నాకూ కొత్తే.... పోర్షన్ ఓ.కే అద్దెమాట చెప్పండి....

గోవిందరాజులు : అద్దెదేం వుందయ్యా...నీలాగ గొప్ప కార్యాలు చెయ్యలేకపోయినా ...ఆదర్శంగా బతికే వారికి అంతో ఇంతో సాయం చేస్తే అదో తృప్తి. నువ్వు, నీ వైఫ్ పక్కనుంటే నాకు కాలక్షేపం అవుతుంది. నీకు ఎంత ఇవ్వాలనిపిస్తే...అంతియ్యి..

రమణ : ఫేసు చూస్తే కొంచెం విలను టైపుగాని, మనసు మాత్రం హీరోది. అయితే రేపే వచ్చి దిగిపోతా. ఓ.కే

**లైట్స్ ఆఫ్**

**లైట్స్ ఆన్**

( తిరిగి లైట్లు వెలిగే సరికి ....దుర్గారావు బయటనుంచి అక్కడికి వచ్చాడు. అటూ ఇటూ చూస్తాడు. ఎవరు కనిపించటంలేదేని గోవిందరాజులు పోర్షన్ వద్దకి వెళ్ళి తొంగి చూసాడు. సందడిలేదు. ఏం చెయ్యాలని ఆలోచిస్తుండగా, శివశంకర శాస్త్రి హడావుడిగా వచ్చాడు. అక్కడున్న దుర్గారావుని చూసాడు )

శివశంకర శాస్త్రి : నమస్కారం సార్...నా పేరు శివశంకర శాస్త్రి అండి... ఈ వీధి చివర్న

డాబాయిల్లు.

దుర్గారావు : అయిసీ... ఏం కావాలి ?

శివశంకరశాస్త్రి : ఇవ్వాళ శ్రావణ శుక్రవారం కదండీ... మా మదర్ ఒరేయ్ చిట్టీ....

దుర్గారావు : చిట్టినా ?

శివశంకరశాస్త్రి : నన్ను ఇంట్లో అంతా అలాగే పిలుస్తారండి.... ఒరేయ్ చిట్టీ అలా బియ్యపు మూటలా కూర్చోకపోతే అలా వెళ్ళి రెండు మామిడాకులు తేవచ్చుగా అందండి...అందుకని ఇలా వచ్చానండి....విడాకులైనా పర్లేదండి...

దుర్గారావు : విడాకులా...

శిశంకరశాస్త్రి : అదేనండీ...విడి ఆకులు రాలిపోయిన ఆకులైనా ఓ.కేనండీ....వెళ్ళి కోసుకోమంటారా . ... ఏరుకోమంటారా ?

దుర్గారావు : ఏరుకోవటమేమిటయ్యా చీప్‌గా ....ఓపికుంటే చెట్టు మొత్తం నరికి మోసుకుపో....

శివశంకర శాస్త్రి : థాంక్యూ సర్ ... అన్నట్లూ మీ పేరు....

దుర్గారావు : పేరులో ఏం వుంది గానీ, ఇల్లు మనదే ...లోపలికెళ్ళి టి.వి పక్కన, టేబుల్ మీద లెదర్ ఫైలుంటుంది....తీసుకొచ్చి ఇయ్యి....

శివశంకరశాస్త్రి : మీరు.... ఈ ఇల్లు....

దుర్గారావు : ఏం డౌటా ? ఇల్లు మనదే ....మైల వచ్చింది. మా బావగారు పోయారు. లోపలికి వెళ్ళకూడదు.

శివశంకరశాస్త్రి : భలే వారండీ .... మీ మీద డౌటేంటి. టేబుల్ పైన లెదర్‌ఫైల్ ఓకేనా....

( లోపలికి వెళ్ళాడు....వెంటనే తిరిగొచ్చాడు ...)

శివశంకరశాస్త్రి : టేబుల్ పైన ఏం ఫైల్స్ లేవు సార్...

దుర్గారావు : ఫైల్ లేదా ? ...ఏం వుంది...?.

శివశంకరశాస్త్రి : కెమెరా తప్ప టేబుల్ మీద ఏం లేవు....

దుర్గారావు : సరే ! ....అలా వెళ్ళి నీ కావలసినన్ని మామిడాకులు కోసుకు పో....

శివశంకరశాస్త్రి : థ్యాంక్స్ సార్ .....

( రమణ పోర్షన్ వైపుగా వెళ్ళాడు. దుర్గారావు సెల్‌ఫోన్ తీసి నెంబర్ డయల్ చేసి మాట్లాడుతున్నాడు .....)

దుర్గారావు : హల్లో ! లాయర్‌గారా....నేను దుర్గారావుని ....గుడ్‌మార్నింగ్ ...మా సిస్టర్‌చేత తెల్ల కాగితాలపైన సంతకం చేయించుకున్నాడని చెప్పానుగా... ఆ పేపర్లు వాపస్ ఇవ్వమని అడగటానికి వచ్చా.... స్నానం చేస్తున్నాడల్లే వుందీ... జనరల్‌గా ఫైల్స్ అన్నీ టేబుల్ మీదే వుంటాయి. కానీ దాచేసినట్టున్నాడు.... కనిపించటంలా...ఆ పేపర్స్ రిటర్న్ చెయ్యమని డైరెక్టుగా అడగమంటారా....ఆ. ....అదీ నిజమే. వాటిని గుర్తుచేసినట్లవుతుంది...తీసుకెళ్ళి ఏ లాకర్లోనో పెట్టాడంటే... లాక్కోలేక, పీక్కోలేక చావాలి. సర్లేండీ... నే వస్తున్నా.... మాట్లాడదాం....) ( దుర్గారావు బయటికి వెడుతుండగా బురఖాలో ఫాతిమా అక్కడికి వచ్చింది.... దుర్గారావు వెళ్ళిపోయాడు. ఫాతిమా బుర్ఖా తీసివేస్తుండగా గోవిందరాజులు లోపలినుంచి అక్కడికొచ్చాడు )

గోవిందరాజులు : వచ్చావా ? ఆసల్యమయిందేం ?.....

ఫాతిమా : క్యాబోల్నా హై సాబ్... పిల్లలికి ఫీజు కట్టాలి...పైసల్లేవు....ఆ బద్మాష్గాడికి రెండు దినాలుగా చెప్తున్నా. పైసల్లేవంటాడు. ఫీజు కట్టకపోతే పిల్లల్ని పంపొద్దని చిట్టిరాసి పంపారు....

గోవిందరాజులు : ఎంత కావాలి ?

ఫాతిమా : వెయ్యి రూపాయిలు సాబ్... మీ కాల్మొక్కుతా....సాయం చెయ్యండి సాబ్... చిట్టీ పాడి పైసలిచ్చేస్తా.

గోవిందరాజులు : మరి నువ్వు కూడా నాకో హెల్ప్.... చెయ్యాలి చేస్తావా ?

ఫాతిమా : చెప్పండి సాబ్... ఏం చెయ్యాలి ?

గోవిందరాజులు : నాతో కల్సి ఫోటో దిగాలి....అంతే !

ఫాతిమా : ఫోటోనా ! మీతోనా ! సలీంకి తెలిస్తే చంపి పారేస్తాడు..... మాఫ్ కర్నా సాబ్...

గోవిందరాజులు : పిచ్చి మొహమా ! ఫోటో పేపర్లో పడదు. గోడలపైన అంటించటానికి కాదు... ఆఫీసు ఫైల్లో వుంటుంది.... అంతే ! సలీంకి తెలీదు. సులేమన్‌కి తెలీదు.

ఫాతిమా : వద్దు సాబ్... ఆడు మంచోడు కాదు...చంపేస్తాడు.

గోవిందరాజులు : తెలీదని చెప్తున్నానా.... పిల్లలికి ఫీజు కట్టాలన్నావని నిన్నడిగా... స్టూడియోకి వెడితే వాడే మేనేజ్ చేస్తాడు.. కంప్యూటర్ వండర్స్ చేస్తుంది... వెళ్ళు వెళ్ళు.

ఫాతిమా : కోప్పడకండి సాబ్.... అలానే సాబ్. మీ ఇష్టం ...కానీ పైసలు ఇప్పుడే ఇవ్వాలి....

గోవిందరాజులు : అలాగే. లోపలికి వెళ్ళి నీ పనులు పూర్తి చేసుకో.,.... నే పిల్చినప్పుడు వద్దువుగానీ....

ఫాతిమా : అలాగే సార్... ( లోపలికి వెళ్తుంది )

గోవిందరాజులు : హమ్మయ్య ....ఒక ప్రాబ్లం సాల్వైపోయింది....కెమెరా రెడీ చేసుకోవాలి.... ( లోపలికి వెళ్తాడు....వెంటనే కెమెరాతో సహా బయటికి వచ్చాడు ...రమణ పోర్షన్ వైపుగా వెళ్ళాడు .....)

గోవిందరాజులు : రమణా.... రమణా....ఏం చేస్తున్నావయ్యా....!

రమణ : ఎవరూ...మీరా బాబాయ్ గారు.....

గోవిందరాజులు : బాబాయిగారు సరేగాని...ఇదేం బాగాలేదయ్యా....

రమణ : ఎలా బావుంటుందండి...పాతికేళ్ళ క్రితం మీ పెళ్ళికి వచ్చిన ప్రజంటేషన్ అయ్యుంటుంది.....మార్చి పారేయండి... ఇప్పుడు కెమెరాల్లో ఎన్ని రకాలు వచ్చాయనుకున్నారు...ట్రమండస్ డెవలప్‌మెంట్స్.....

గోవిందరాజులు : ఆపుతావా...నేడనడిగింది కెమెరా గురించి కాదు...నీ వైఫ్ గురించి...ఎప్పుడు తీసుకొస్తున్నావ్...మాట్లాడవేం....

రమణ : కొంచెం టైం పడుతుందండి...

గోవిందరాజులు : మాట్లాడటానికా...

రమణ : కాదండి నా వైఫ్‌ని తీసుకురావటానికి.....

గోవిందరాజులు : ఏమిటి ప్రాబ్లం అని అడుగుతున్నా....

రమణ : ఏం చెప్పమంటారు ? ఎలా చెప్పమంటారు ?

గోవిందరాజులు : బాధపడకు, నాదోరకం ప్రాబ్లం, నీదోరకం ప్రాబ్లం. మనసు రాయి చేసుకోవాలి....అంతా తెల్సే చేసుకున్నావా.....

రమణ : ఏం చెప్పమంటారు....ఎలా చెప్పమంటారు....

గోవిందరాజులు :అంతేలే ...ఏమిటో. మనం ఆదర్శాలకి పోతాం. వాళ్ళేమో మూడుముళ్ళు పడగానే మగవాడ్ని పగవాడిగా చూసి కాల్చుకుతింటారు... బాధపడకు. ఎంతైనా భార్య, తీసుకొచ్చి ఇంట్లో పెట్టుకో... ఎలాగూ పక్కనే వున్నాకాబట్టి బతిమాలో, బామాలో లైన్‌లో పెడతా...అదే..నీ దారికితెస్తా....అవునూ...ఆ మాడు వాసనేమిటి ?

రమణ : ఏం చెప్పమంటారు...ఎలా చెప్పమంటారు...మనసు మండిపోయి మెదడు మాడిపోతోంది.....

గోవిందరాజులు : నీ బొంద.... మనసు కాదు పొయ్యి మీద అన్నంలాగా వుంది.

రమణ : ఆ ! ఓ అమ్మా.....

( లోనికి పరుగెత్తబోగా లోపలినుంచి వస్తున్న శాస్త్రిని డాష్ కొట్టాడు. ఇద్దరు కిందపడ్డారు. రమణ లేచి లోనికి వెళ్ళిపోగా, శాస్త్రి ఏడుపు మొహంతో )

శాస్త్రి : వీడెవడండీ బాబూ...

గోవిందరాజులు : అసలు నువ్వెవరూ....

శాస్త్రి : మీరెవరూ....

గోవిందరాజులు : గోవిందరాజులు ...ఇంటి ఓనర్ని....

శాస్త్రి : ఊరుకోండి... ఒక ఇంటికి ఇద్దరు ఓనర్సుంటారేంటి...పేరు శాస్త్రి, మొహాన బొట్టు ఉన్నాయి గదా ఏం చెప్పినా చల్తాహై అనుకోకండి... ఆ !

గోవిందరాజులు : ఎవర్రా నువ్వు, పోకిరీ వెధవ. చెప్పాపెట్టకుండా ఇంట్లోకి జొరబడింది గాక, పైగా డబాయిస్తావా...నీ సంగతి తేలుస్తా... రమణా పోలీసులకి ఫోన్ కొట్టు....

శాస్త్రి : సార్, సార్, నాకేం తెలుసు సార్, మా మదర్ మావిడాకులు తెమ్మంటే వచ్చాసార్...ఆయనెవరో లావుగా, పొట్టిగా, మినువుల బస్తాలాగా వున్నాడు. ఇల్లు మనదేలే...ఆకులేంటి, చెట్టే నరుక్కుపో అన్నాడు....

గోవిందరాజులు : నరికేవా ...అసలు వాడెవడూ...

శాస్త్రి : తెలీద్సార్...సారీ సార్. అయాం వెరీసారీ సార్

( అంతలో ఫాతిమా అక్కడకు వచ్చింది )

ఫాతిమా : కాం హోగయా సాబ్, మై జారుం....

గోవిందరాజులు : నా వైఫ్....రామలక్ష్మి ...నీ పేరేమిటన్నావ్...

శివశంకరశాస్త్రి : శివశంకరశాస్త్రి ..సందు చివర్న డాబా ఇల్లు... నమస్తే మేడం...

ఫాతిమా : ఆదాబ్....భయ్యా ( కుర్రాడు షాక్ )

గోవిందరాజులు : శాస్త్రీ సమయానికొచ్చావ్. చిన్న హెల్పుచేసి పెట్టు.... నీకు మావిడాకులిస్తాలే....

శివశంకరశాస్త్రి : చెప్పండి సార్....

గోవిందరాజులు : ఈ కెమెరా తీసుకొని, మా ఇద్దర్నీ ఒక ఫోటో తియ్యి...

శివశంకరశాస్త్రి : ఫోటోనా నేనా....?

గోవిందరాజులు : అవునూ...ఏం....

శివశంకరశాస్త్రి : కెమెరా ఆపరేషన్ ఆస్సలు తెలీదు...ఫోటో రాకపోతే మీరు తిడతారు... నేను బాధపడతా,....

గోవిందరాజులు : నే చెప్తాగా...వెరీ సింపుల్ రా... ఇలా చూస్తూ ఇది ఇలా క్లిక్ చెయ్యాలి అంతే....

శివశంకరశాస్త్రి : అంతేనా ! ...కానీ....

గోవిందరాజులు : కాని లేదు, సోనీలేదు...ఇంద తీసుకో..... ( కెమెరా ఇచ్చాడు )

శివశంకరశాస్త్రి : ఇదీ సోనీ కాదు సార్...కొడాక్....

గోవిందరాజులు : ఏదో ఒకటి...త్వరగా కానియ్యి ....వూ...

( గోవిందరాజులు వెళ్ళి ఫాతిమా పక్కన నిబలడ్డాడు )

గోవిందరాజులు : ఇద్దరం క్లియర్‌గా కనిపిస్తున్నాంగదా... బాగా దగ్గరిగా రా...ఫుల్ సైజొద్దు...ఎడ్జస్టుచేసుకో.... ఏం కనిపిస్తోందీ....

శివశంకరశాస్త్రి : ఆకాశం....

గోవిందరాజులు : ఆకాశమా ! కెమెరా కిందకి దింపు. కనిపిస్తున్నామా...!

శివశంకరశాస్త్రి : ఆ ! కనిపిస్తున్నారుగాని... ఏంటి సార్ పక్కవాడి భార్యతో ఫోటో తీయించుకుంటున్నట్టు ఇద్దరూ వణికి పోతున్నారు ?

గోవిందరాజులు : నీ బొంద ! వణుకుతున్నది మేముగాదు. నువ్వు స్టడీగా వుండు... వూ... కొట్టూ....

శివశంకరశాస్త్రి : ఏంటి సార్, ఫోటో తియ్యమంటారు, మళ్ళీ కొట్టమంటారు. రెండే పనులు ఒకేసారి ఎలా సార్ చేసేది....

గోవిందరాజులు : శివ శివా !

శివశంకరశాస్త్రి : పిల్చారా సార్ ....

గోవిందరాజులు : ఓరి నీయబ్బ....త్వరగా క్లిక్ చెయ్యరా... వూ ...వన్, టూ...త్రీ

శివశంకరశాస్త్రి : నా లక్కీ నెంబరు ఫోర్ సార్....త్రీ వద్దు....

గోవిందరాజులు : అలాగే స్టడీ వన్...టూ ...త్రీ...ఫోర్...( శాస్త్రి క్లిక్ చేశాడు )

గోవిందరాజులు : అలాగే ఇంకోసారి క్లిక్ చెయ్యి...స్టడీ వన్...టూ...త్రీ...

శివశంకరశాస్త్రి : ఆగండి సార్....మీరు ఇద్దర్ని కదా ఫోటో తీయమంది, మరి నాకు మగ్గురు కనిపిస్తున్నారేమిటీ....

గోవిందరాజులు : ముగ్గురా....

( అప్పుడు వెనకే వచ్చి నిల్చున్న సలీంని చూసాడు...ఫాతిమా కెవ్వున అరిచింది. గోవిందరాజులు కంగారుపడ్డాడు )

సలీం : యే క్యా ....కర్రేమియా...

( అంటూ వెళ్ళి కుర్రాడి చేతిలో వున్న కెమెరా లాక్కున్నాడు. గోవిందరాజులు కంగారు. ఫాతిమా పారిపోవటానికి వెనక్కి తిరిగింది. రమణ నిల్చొని వున్నాడు )

శివశంకరశాస్త్రి : నాకేం తెలీదు సార్...అలా వెడుతుంటే పిల్చి ఆయన్ని, వైఫ్‌ని కలిపి ఫోటో తీయమన్నాడు.

రమణ :వైఫా ?

సలీం : వైఫ్....మతలబ్ బీవీ ?

గోవిందరాజులు : అదేం కాదయ్యా...అసలేం జరిగిందంటే...

( సలీం భార్య వద్దకి వచ్చాడు. కోంగా ఆమె మొహాన వున్న బొట్టు తుడిచేసి, చెయ్యి పుచ్చుకుని లాక్కుపోతూ )

సలీం : అరె ఇంత మోసం ...పోలీస్ రిపోర్ట్ దేదుంగా... దేఖ్ లేతుం...

( ఫాతిమాతో సహా ఆవేశంగా వెళ్ళిపోయాడు )

గోవిందరాజులు : ఒరేయ్...కెమెరా రా ... నిన్నే ...ఆగు...

రమణ : పనిమనిషితో ఫోటో ఏంటండీ.... ఛండాలంగా...

శివశంకరశాస్త్రి : పనిమనిషా ...అంటే ఆవిడ మీ వైఫ్ కాదా....

గోవిందరాజులు : వీడ్ని తగలెయ్య...కెమెరా పట్టుకుపోయాడు... నువ్వేంటి నా పోర్షన్‌లోంచి వస్తున్నావ్ ?

శివశంకరశాస్త్రి : సార్ పోలీసు రిపోర్టు అంటున్నాడు.... భయంగా వుంది సార్....

రమణ : నీకేంటి ? నీ పొజిషన్‌లో ఎవరన్నా భయపడతారు. పరాయి వాడి వైఫ్‌ని, ఇంకోమగాడ్ని కలిపి ఫోటో తీయడం పెద్ద నేరం. జడ్జిగారు మంచివాడైతే ఏడాది లేకపోతే.

శివశంకరశాస్త్రి : ఏడాది జైలా సార్ ? ...కాపాడండి. అన్యాయంగా నన్ను ఇరికించారు. నాకేం తెలీదు సార్....

గోవిందరాజులు : వుండవయ్యా...అంతా కంగారుగా వుంది. సమయానికి వచ్చి చచ్చాడు. ఇపుడేమిటి చెయ్యటం...ఇదిగో రమణా....

రమణ : ప్లీజ్ ...నాకేం తెలీదు... నా జోలికి రాకండి...నా ప్రాబ్లంస్ నాకున్నాయ్ ప్లీజ్ ( తన పోర్షన్‌లోకి వెళ్ళిపోయాడు )

శివశంకరశాస్త్రి :సార్..సార్..మీరు పెద్దవాళ్ళు. నిజం చెప్పండి. నా తప్పేముంది ? నా గురించి చెప్పకండి. మీ కాళ్ళు పట్టుకుంటా.

గోవిందరాజులు : అంతా అయిపోయినట్టు దేనికా కంగారు....కుర్రాడివి ధైర్యంగా వుండాలి ( ఇంతలో కామాక్షి అక్కడికి వచ్చింది )

కామాక్షి : హల్లో ! గుర్తున్నానా...

గోవిందరాజులు : నువ్వా ! సారీ మీరా? రమణని ఇందాకే అడిగా నీ గురించి.

కామాక్షి : రమణా ? వాడెవడు ? ఈ కుర్రాడెవడు ?

గోవిందరాజులు : ఇతనా ? ఆటలో అరటిపండులే. రమణంటే ఎవడంటావేంటి ? నీ మొగుడు.

కామాక్షి : నా మొగుడా ? ( అంటూ పగలబడి నవ్వింది )

గోవిందరాజులు : దేనికా నవ్వు ? రేయ్ అబ్బీ జరిగిందంతా మర్చిపో. ఎక్కడా నోరు విప్పకు. అవసరం అయితే కబురు పంపిస్తా. ...నీ పేరు శివశంకరశాస్త్రి కదూ.... శివాలయం దగ్గర డాబా ఇయిల్లు ... అంతేగా...

శివశంకరశాస్త్రి : సార్...నా తప్పేం లేద్సార్...మీరు పిలిస్తే గదా వచ్చి మిమ్మల్ని, పనిమనిషిని ఫోటో తీసింది. నాకేం తెల్సు సార్...

కామాక్షి : పనిమనిషితో ఫోటోనా ...ఏంటి కుర్ర....

గోవిందరాజులు : నీకేం కాదు...నువ్వెళ్ళిరా...వూ...పద...

( కుర్రాడు కళ్ళు తుడచుకుని వెళ్ళిపోగా.... గోవిందరాజులు అతడ్ని సాగనంపటానికి బయటికి వెళ్ళగా, కామాక్షి అదే అదనుగా గోవిందరాజులు పోర్షన్‌లోకి పరిగెత్తింది. గోవిందరాజులు తిరిగొచ్చి, కామాక్షి కోసం అటు ఇటూ చూసి ....)

గోవిందరాజులు : లోపలికి వెళ్ళుంటుంది ( అని వెనక్కి తిరిగేసరికి దుర్గారావు బుర్ఖాతో అక్కడికి వచ్చాడు. అతడ్ని చూసి ఫాతిమాగా పొరబడి గోవిందరాజులు కంగారుగా అతని దగ్గరకి వెళ్ళి....) ఫాతిమా ! వచ్చావా....కంగారు పడిపోతున్నా నీ మొగుడేం అంటున్నాడు ? ...కెమెరా ఏదీ ? వాడి దగ్గరే ఉందా ?

దుర్గారావు : ( గొంతుమార్చి ) వూ... నే చెప్పను...

గోవిందరాజులు : అబ్బా.... తెలుగు బానే మాట్లాడుతున్నావే....ఇంతకీ వాడేం అంటున్నాడు..

దుర్గారావు : మన సంగతి వాడికి తెల్సిపోయింది.

గోవిందరాజులు : సంగతా...అదా ! ...సమయానికి  ఎవరో పిల్చినట్టు వచ్చి అంతా చూసాడు... ఏవంటున్నాడు ?

(ఇంతలో రమణ ఈల వేసుకుంటూ తన పోర్షన్‌లోంచి బయటికి వచ్చాడు )

నువ్వు లోపలికి వెళ్ళు. నే వస్తా...

(దుర్గారావు గోవిందరాజులు పోర్షన్‌లోకి వెళ్ళాడు ) మాంచీ ఉషారుగా వున్నావ్... నీ వైఫ్ వచ్చిందని సంతోషమా ?

రమణ : వైఫా ?

గోవిందరాజులు : నీ వైఫ్....కామాక్షి....

రమణ : కామాక్షి... ఓ కామక్షి... ఏంటన్నారు ? ....వచ్చిందా....

రమణ : అవునూ...వచ్చిందిగా....  దేనికయ్యా అంత సీక్రెట్టు ?

( అంతలో లోపలినుంచి కామాక్షి గొంతు.....కంగారు కంగారుగా అరిచింది )

కామాక్షి : ఏయ్.... ఎవరునువ్వు...వదులు...నిన్నే...

( రమణ, గోవిందరాజులు షాక్...గోవిందరాజు కంగారుగా లోనికి వెళ్ళబోగా, కామాక్షి కంగారు కంగారుగా బయటికి వచ్చింది )

గోవిందరాజులు : ఏంటి ఫాతిమా ఏమైంది ? దేనికలా అరిచావ్ ?

( కామాక్షి తన మొహం రమణకి మాత్రమే కనిపించేలా ముసుగుతో, అతడ్ని పక్కకి తీసుకెళ్ళి )

కామాక్షి : లోపల వేరే ఎవరో వున్నారు

( అని బయటికి వెళ్ళిపోబోగా, గోవిందరాజులు గుమ్మం వరకు ఫాలో అయ్యాడు. ఇది జరుగుతుండగా లోపల వున్న దుర్గారావు పాక్కుంటూ బైటికొచ్చి ఎవరికంటా పడకుండా రమణ పోర్షన్ లోకి వెళ్ళిపోయాడు )

గోవిందరాజులు : ఏమైంది ? దేనికి కంగారు... వెళ్ళిపోతున్నావ్...వాడు పోలీసు కంప్లైంటు ఇచ్చినా కంగారు పడక ....కేసుని ఆ కుర్రాడి మీదకి తోసేద్దాం

( శివశంకరం తలుపు పక్కన నిల్చుని ఉన్నాడు కాబోలు, గమ్మున వచ్చి, కాళ్ళపైన పడ్డాడు... ఏడుస్తూ....కామక్షి బయటికి వెళ్ళిపోయింది )

శివశంకరశాస్త్రి : అన్యాయం సార్ ! ...నాకే పాపం తెలీదు, దేవుడు క్షమించడు...

గోవిందరాజులు : ఓరి నీ ఇల్లు బంగారం గానూ... నువ్వు ఇంకా వెళ్ళలా....

శివశంకరశాస్త్రి : ఎలా వెళ్ళేది సార్.... మా నాన్న చంపేస్తాడు సార్....

రమణ : వుండవయ్యా...ఇదిగో మీరిలా రండి,....లోపల ఇంకెవరున్నారు...

గోవిందరాజులు : రహస్యం చెప్పాలా ! ఎవరు లేరులే చెప్పు...

రమణ : రహస్యమా నా బొందా ...అయితే లోపల దొంగవెధవ వున్నాడండి...

గోవిందరాజులు : దొంగా ! ...నీకెలా తెలుసూ...

రమణ : కామాక్షి చెప్పింది....

గోవిందరాజులు : కామాక్షా...అంటే ఆ వెళ్ళింది నీ వైఫ్ కామాక్షా...

రమణ : కామాక్షే...కాని నా వైఫ్ కాదు...

గోవిందరాజులు : అదేంటయ్యా.... అలా మాట్లాడుతున్నావ్. ఇంతకీ ఫాతిమా ఎక్కడా?

రమణ : ఇంట్లో దొంగ వున్నప్పుడు పోలీసుల గురించి అడగాలి. పని మనుషుల గురించి కాదు.

శివశంకరశాస్త్రి :సార్ ...వద్దు సార్, పోలీసులొద్దు సార్. నా తప్పేంలేద్సార్...

( ఇంతలో సలీం ఫుల్లుగా తాగి తూలుకుంటూ ప్రవేశించాడు )

గోవిందరాజులు : రమణా! వీడ్ని తగలెయ్య్, వీడొచ్చాడయ్య. పైగా బాగా తాగినట్టున్నాడు.

సలీం : ఏంట్రా గుసగుసలు, నా వైఫ్‌తో ఫోటో ...ఇంతవరకు నా వైఫ్‌తో ఫోటో నాకే నహీహై ..అవునూ...ఇంకా పోలీసులు రాలేదా....

శివశంకరశాస్త్రి : సార్... నా తప్పేం లేద్సార్...పోతున్నవాడ్ని పిల్చి ఫోటో తీయించారు. ఒట్టుసార్.

గోవిందరాజులు : పోలీసులకి చెప్పి చచ్చాట్ట. ....ఇప్పుడేమిటి చేయటం.

రమణ : ఏం చెయ్యొద్దు. పోలీసులొస్తే ఇద్దరు దొంగల్ని ఒకేసారి పట్టుకుపోతారు.

శివశంకరశాస్త్రి : సార్ ! అన్యాయం సార్...మీరు కూడా అలా అంటారేంటి సార్. నాకేం తెలీదు సార్.

సలీం : రేయ్...నేనెవర్ననుకుంటున్నావ్...పనిమనిషి మొగుడ్నిరా....ఎక్కడ ఫాతిమా ?

గోవిందరాజులు : లోపలుంది వెళ్ళు.

రమణ : లోపలుంది దొంగండి.

సలీంల : దొంగా ...నా భార్యని దొంగంటావా ? నీ పేరేంట్రా...

గోవిందరాజులు : అతనికి తెలీదులే నువ్వెళ్ళు ...లోపలుంది నీ పెళ్ళాంకాక ఎవరన్నా ఉంటే పెద్దగా అరు... మేం పోలీసుల్ని పిలుస్తాం.

శివశంకరశాస్త్రి : సార్...

రమణ : చుప్....

సలీం : ఓకే ఫాతిమా. క్యాకర్రే, మాఫ్ కర్నా... మై పీకే హూ...

( లోపలికి వెళ్ళాడు )

గోవిందరాజులు : ఏమిటీ ఏదో పీకానంటున్నాడు....

రమణ : ఆ పీకటం కాదు... ఈ పీకడం.....

( అందరూ టెన్షన్‌గా చూస్తున్నారు. సలీం తూలుకుంటూ బయటికి వచ్చాడు )

సలీం : ఫాతిమా.....లేదు....

గోవిందరాజులు : ఎవరున్నారు....ఎవరన్నావున్నారా ?

సలీం : ఎవ్వర్లేరు....ఫాతిమా ఎక్కడా ? చెప్తావా ? పోలీసుల్ని....

శివశంకరశాస్త్రి : సార్....

సలీంట : నీయబ్బ ఈడెవడ్రా, పోలీసంటే పాదాలట్టుకుంటున్నాడు.

( అంతలో దుర్గారావు రమణ పోర్షన్‌లోంచి బుర్ఖా వేసుకొని బయటికి వచ్చాడు )

గోవిందరాజులు : ఫాతిమా.... అదేంటి... ఆ పోర్షన్‌లోంచి వస్తున్నావ్ ?

సలీం : ఉదర్ క్యాకర్రే ....మాఫ్ కర్నా, మై పీకే ఆయాహూ...ఛలో బాత్ కర్నా...!

( అని చెయ్యిపట్టుకోబోగా, దుర్గారావు లాగిపెట్టి కొట్టి బయటికి వెళ్ళిపోగా...సలీం కళ్ళు తిరిగి కిందపడ్డాడు )

గోవిందరాజులు : అదేంటి అలా కొట్టింది ?....

రమణ : అడగలేకపోయారా ? చెప్పేదిగా. అయినా మీ పనిమనిషి నా పోర్షన్‌లోకి ఎప్పుడు వెళ్ళింది ? ఎలా వెళ్ళింది అని....

శివశంకరశాస్త్రి : సార్... ఇప్పుడు అలా వెళ్ళింది ఆడ మనిషి కాదండి... మొగవాడు.

గోవిదంరాజులు : ఫాతిమా కాదా...! నీకెలా తెల్సు...

శివశంకరశాస్త్రి : చూసానండీ ?...

గోవిందరాజులు : ఏం చూసావ్ .

రమణ : ఏదో చూసాడులెండి ...మగాడా...అంటే దొంగా ...నా పోర్షన్‌లోకి ఎలా వచ్చాడు.

గోవిందరాజులు : రే....ఇలారా...నీ పేరేంటన్నావ్....

శివశంకరశాస్త్రి : శాస్త్రి అండి.... శివశంకరశాస్త్రి, నాకు కంగారుగా వుంది సార్.....

రమణ: అమాయకుడిలా వున్నావ్. నీకెందుకయ్యా కంగారు వాడి పెళ్ళాంతో ఫోటో దిగింది ఆయన.

శివశంకరశాస్త్రి : కాని తీసిచచ్చింది నేనుగదా !

రమణ : అని రుజువేంటి ?

శివశంకరశాస్త్రి : సార్ ...ఎంతమంచి మాట చెప్పార్సార్...నిజంగా మీరు....

గోవిందరాజులు : ఫోటో తీసింది ఎవరు అని అడుగుతారా...అప్పుడు నీ పేరు చెప్పక తప్పదుగా.... శాస్త్రుల్లు....

శివశంకరశాస్త్రి : సార్ ! మీకు తెల్సు నాకేం తెలీదని....

గోవిందరాజులు : అసలింతకీ ఈ త్రాష్టుడు కెమెరా ఏం చేశాడని....

సలీం : ( లేచి కూర్చుంటూ ) అమ్మేసా...ఫుల్‌గా తాగేసా...

రమణ : సార్ అమ్మేసాట్ట...రీలు ఏం చేసాడో అడగండి....

గోవిందరాజులు : నువ్వు అడగొచ్చుగా, ఏరా కెమెరా అమ్మేసావా...ఎవడబ్బ సొమ్మురా...సిగ్గులేదు ? నిన్ను పోలీసులకి పట్టించకపోతే.

శివశంకరశాస్త్రి : సార్ ! వద్దు సార్ నీ కాళ్ళు పట్టుకుంటా,

రమణ : వుండండి . పాత కెమెరా పోతే పోయింది. ఏరా అవునూ రీలుతో సహా అమ్మేసావా ?

సలీం : నేనేం పాగల్‌గాడ్నా...ఫాతిమాకి విడాకులు ఇవ్వాలని ఎప్పట్నించో ఆలోచిస్తున్నా. పరాయి వాడితో ఫోటో దిగిన ఫాతిమా నాకొద్దని మా బామ్మర్ది గాడికి రీలిచ్చి వచ్చా. వాడీపాటికి ప్రింట్లేయించి సిస్టర్ని పిచ్చ పీకుడు పీకుతుంటాడు.

శివశంకరశాస్త్రి : మీ బావమరిది గారి పేరేంటి సార్. ఎక్కడుంటారు ?

సలీం : ఏం ? సార్ నాకేం తెలీదని వాడి కాళ్ళ మీదపడదామనా ? ఆడు పెద్ద దాదా. అంటే రౌడీ....

గోవిందరాజులు : రౌడీనా....

శివశంకరశాస్త్రి : సార్ రౌడీ అట సార్. వాడికన్నా పోలీసులు బెటరు సార్... రికమండేషన్స్, లంచాల అరేంజ్మెంట్స్ వుంటాయి...

రమణ : ఏమిటయ్యా, నువ్వు చెప్పింది నిజమా... ఎందులా తొందరపడ్డావ్...

సలీం : తొందరపడ్డానా... ఆలశ్యమైందని నేను ఏడుస్తూ వుంటే... ఈ దెబ్బతో ఫాతిమా అవుట్. కామాక్షీ ఇన్...

గోవిందరాజులు : కామాక్షీ అంటే...మన కామాక్షా ?

రమణ : మన ఏంటండీ...అసలు కామాక్షి ...నా వైఫ్ కాదు.

గోవిందరాజులు : ఇదెక్కడ గోలయ్యా...వాడి పెళ్ళాన్ని వాడు కాదంటున్నాడు. నీ భార్యని నువ్వు కాదంటున్నావ్ ......

రమణ : అబ్బ అక్కడికి భార్యని నీ నెత్తిపైన పెట్టుకొని పూజలు చేసేవాడిలాగ....

సలీం : సరే మా బావమర్దిగాడు ఏ క్షణంలోనైనా రావచ్చు.తిడతాడు.తిట్టనీండి... అరుస్తాడు... అరవనీండి...కొడతాడు... కొట్టనీండి...

రమణ : చంపుతాడు.... చంపుకోనీండి... అంటావా ?

సలీం : చంపడు...ఫాతిమాకి మొగుడు కావాలి గదా !

గోవిందరాజులు : ఫాతిమాకి మొగుడా....అంటే.....

( అంతలో బయటనుంచి భయంకరమైన అరుపు వినిపించింది. అందరూ ఉలిక్కి పడ్డారు )

గోవిందరాజులు : వాడేనా...

సలీం : వాడే... నే వెళ్ళిపోయానని చెప్పండి...

( రమణ పోర్షన్‌లోకి పారిపోయాడు. వెంటనే ఖాన్‌దాదా, ఫాతిమ రెక్కపుచ్చుకుని తీసుకొచ్చాడు. గళ్ళలుంగీ, తెల్లలాల్చి, కిర్రుచెప్పులు భయపెట్టేలా వున్నాడు. లోపలికి రాగానే ఫాతిమాని అడిగాడు )

ఖాన్ : వీళ్ళల్లో నా బావగారెవరు ?

( ఫాతిమా వెళ్ళి గోవిందరాజులికి పాదాభివందనం చేసింది )

గోవిందరాజులు : శ్రీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు !

రమణ : సుపుత్రప్రాప్తిరస్తు !

గోవిందరాజులు : ఫాతిమా దేనికీ పాదాభివందనాలు ?

ఖాన్ : ఇప్పటి నుండి దాని మొగుడివి కదా ! ....కంగ్రాట్స్ బావగారు....

గోవిందరాజులు : మొగుడా ? ఏం తమాషాగా వుందా ? పోలీసుల్ని పిలుస్తా...

శివశంకరశాస్త్రి : సార్ వద్దు సార్...వప్పేసుకోండి సార్... ఇదే బెటరు సార్...

ఖాన్ : ఏంట్రా ...పోలీసుల్ని పిలుస్తావా... పిలు... పిలవరా.. నీ యబ్బ ఫోటో చూసి పోతారు.

రమణ : మీ పేరేంటో ?

ఖాన్ : రసూల్ ఖాన్....ఖాన్ దాదా పేరు చెప్తే గడగడ లాడిపోవాలి...

ఫాతిమా : భాయి సాబ్...మై క్యాకరూ !.....

ఖాన్ : ఇది నీ ఇల్లమ్మ ...దేవుడులాంటి మొగుడు దొరికాడు....లోపలికి వెళ్ళి టీ పెట్టు. బావగారితో కల్సి తాగుదాం.

గోవిందరాజులు : రేయ్....ఎవడ్రా నీకు బావగారు...రౌడీ వేషాలేసావో పోలీసుల్ని....

శివశంకరశాస్త్రి : సార్ ...వద్దు సార్.... ఒప్పేసుకోండి సార్....

( ఖాన్ ఆవేశంగా గోవిందరాజులూ చొక్కా పుచ్చుకున్నాడు )

ఖాన్ : ఎవడ్రా ....బావగారా. ...నువ్వేబే... పైగా నా చెల్లెలితో ఫోటో దిగినవాడు బావగారు కాక ఏమవుతాడ్రా.... దొంగనాయాలా....

రమణ : ఖాన్‌గారు...ప్లీజ్ వదలండి.... ఆ ఫోటో ఎవరో గిట్టని వాళ్ళు ....

శివశంకరశాస్త్రి : అంతా అబద్దం సార్... వీధిలో వెడుతుంటే నన్ను, నా వైఫ్‌ని ఫోటో తీయమంటే నేనే.....ఖాన్ ఫోటో తీసింది నువ్వన్నమాట.....నిన్నూ....

శివశంకరశాస్త్రి : సార్ నా తప్పేంలేదు సార్ ఒట్టుసార్ !

( ఇంతలో కామాక్షి బుర్ఖా వేసుకుని లోనికి వచ్చింది. అక్కడ అందర్నీ చూసింది. ఖాన్‌కి విష్ చేసింది )

కామాక్షి : ఆదాబ్ ఖాన్ భాయ్...

ఖాన్ : ఆదాబర్సే....

కామాక్షి : సలీం వచ్చాడా ?

గోవిందరాజులు : నీ భార్యకి వాడితో పనేంటో అడుగు....

రమణ : కామాక్షి నా వైఫ్ కాదండి బాబు....

కామాక్షి : అసలు నే కామాక్షినే కాదు... ఇప్పుడు అనార్కలిని ...సలీం నేను పెళ్ళి చేసుకుంటున్నాం.

ఫాతిమా : భాయ్ సాబ్ నా బతుకు బర్ బాద్ వోగయా.....!

ఖాన: పోనీలే అమ్మా...తాగుబోతు వెధవ... పీడాపోయిందనుకో...నీకు బాబాయిగారు దొరికారుగా....

గోవిందరాజులు : బాబాయిగారు దొరికారా ? ఎలా కనిపిస్తున్నా నీ కంటికి....రమణ పోలీసులకి ఫోను కొట్టు.....

శివశంకరశాస్త్రి : సార్ వద్దు సార్... ఇదే బెటర్ సార్...ఒప్పేసుకోండి సార్....

కామాక్షి : ఇంతకీ సలీం లేడా ? రాలేదా.... నిన్నే పెద్దాయన...

గోవిందరాజులు : సలీం లేడు. షాజహాను లేడు....పొండి...

కామాక్షి : సలీం, నేను ప్రేమించుకున్నాం, ఆటో వున్నవాడు. ఆలోచించేవాడు. అర్థం చేసుకునేవాడు. ఇలా పిలిస్తే అలా పలికేవాడు. ( అని రెండు అడుగులు ముందుకొచ్చి రెండు చేతులు నోటికి అడ్డం పెట్టుకుని నాటకీయంగా ) సలీం... ! సలీం...! నేనిక్కడ ...నువ్వెక్కడ ! సలీం...!( అంతే .....! సలీం రమణ పోర్షన్‌లోంచి రెండు చేతులు చాచి పరిగెత్తుకుంటూ అక్కడికి వచ్చాడు. )

సలీం : అనార్ ! వచ్చేసా ...!

కామాక్షి : సలీం...

సలీం : అనార్....

గోవిందరాజులు : ఓరి వీళ్ళ ప్రేమపాడుగాను.... రమణ అలా చూస్తూ నిల్చుంటావేం... నీ వైఫ్....కా

రమణ : కామాక్షి నా వైఫ్ కాదని చెప్పానా...

కామాక్షి : నేను కామాక్షిని కాదని చెప్పానా... సలీం...

సలీం : అనార్...

ఫాతిమా : భాయ్‌సాబ్...

ఖాన్ : కంగారుదపకమ్మా...మామిడిపండులాంటి మొగుడు దొరికాడు....

గోవిందరాజులు : ఇదిగో.... మళ్ళీ చెప్తున్నా. అది నా వైఫ్ కాదు... కాలేదు...

శివశంకరశాస్త్రి : వొప్పేసుకోండి సార్ ఈ వయస్సులో ఎవరైతే ఏంటి .

ఖాన్ : నీ పేరేంట్రా ...సారీ మీ పేరేంటి బావగారూ...

రమణ : గోవిందరాజులు...

ఖాన్ : ఈ క్షణం నుంచి నీ పేరు గఫూర్‌ఖాన్...

గోవిందరాజులు : గఫూర్‌ఖానా... అంటే గడ్డం కూడా పెంచాలా....

శివశంకరశాస్త్రి : పేరు బావుంది. ఒప్పేసుకోండి సార్....

రమణ : చూడండి ఖాన్ గారూ. మీ చెల్లెలితో ఫోటో దిగడం తప్పే. కాదన్నుకాని అంత మాత్రానికే మతాలు, పేర్లు మార్చి మీ చెల్లెల్ని చేసుకోమని బెదిరించడం అమానుషమే కాదు, నేరం కూడా....

ఖాన్ : ఏంట్రా...నీతులు చెప్తున్నావ్...పరాయి ఆడదానితో ఫోటో దిగడం నేరం కాదా...అమానుషం కాదా ?

గోవిందరాజులు : పెన్షన్ డబ్బులు గురించి కక్కుర్తిపడ్డా.... క్షమించండి ఖాన్‌గారూ...

ఖాన్ : నాకు నా సిస్టర్ జీవితం ముఖ్యం. ఆ బద్మాష్ గాడు అన్నీ మర్చిపోయి ఫాతిమాని ఏలుకుంటానంటే నేను క్షమించటానికి రెడీ !

గోవిందరాజులు : నే ఒప్పిస్తా ! ఒరే సలీం మా బాబువి కదూ ! జరిగిందాంట్లో ఫాతిమా తప్పేం లేదు. తప్పంతా నాదే. కోపం ఉంటే నన్ను కొట్టు. కాని పాపం ఫాతిమాకి అన్యాయం చెయ్యకు. ప్లీజ్ !

ఫాతిమా : సలీం

సలీం : ఓ.కే. ఈ అనార్కలి మళ్ళీ కామాక్షి అయిపోతేనే ఫాతిమాని భార్యగా అంగీకరిస్తా...

రమణ : కామాక్షి విన్నావుగా ...పాపం ..పిచ్చిది ఫాతిమా వాళ్ళిద్దరినీ విడదీసి పాపం మూటగట్టుకోకు. నా మాట విను. మళ్ళీ కామాక్షిగా మారిపో....

గోవిందరాజులు : రమణ చెప్పింది బావుంది. ...వూ.అను.

శివశంకరశాస్త్రి : ఒప్పేసుకోండి మేడం...ప్లీజ్ మేడం...

కామాక్షి : ఓ.కే.మీరందరూ ఇంతగా చెప్తున్నారు కాబట్టి, నా వల్ల ఇంకో ఆడదానికి అన్యాయం జరగడం ఇష్టంలేదు కాబట్టి, కామాక్షిగా మారి మీ భార్యగా ఉండిపోతా !....

రమణ : ఆ... నా భార్యగానా !...

రమణ : అంత ఆశ్చర్యం ఎందుకట....నీ భార్య నీ భార్యలా కాక పక్కవాడి భార్యగా ఉంటుందా ?

రమణ : అయ్యో ఈ కామాక్షి నా భార్య కాదండి....

శివశంకరశాస్త్రి : ఒప్పేసుకోండి సార్...ప్లీజ్ సార్...

గోవిందరాజులు : కామాక్షి నీ భార్య కాదా ? ఇలా నా కళ్ళల్లోకి చూసి చెప్పు...

రమణ : కళ్ళల్లోకి కాదు, గుండెల మీద కూర్చుని చెప్తా.... మీరు పెళ్ళైన వాళ్ళకే పోర్షను ఇస్తారంటే వీధిలో పరిచయం అయిన ఈ కామాక్షిని భార్యగా నటించమని కిరాయికి మాట్లాడుకున్నా.....

కామాక్షి : త్వరగా చెప్పండి.... నే కామాక్షినా...అనార్కలినా...

శివశంకరశాస్త్రి : పాపం ఆంటీని చూస్తే ఏడుపువస్తుంది.సార్ ఒప్పేసుకోండి సార్...

గోవిందరాజులు : రమణా...ఓకే...అవసరాల కోసం అందరూ ఆడతారు. తప్పులు చేస్తారు. కామాక్షి అనుభవం కల మనిషి ...ఎవరైతేనేం ... కట్టేసుకో...వూ..అను.

శివశంకరశాస్త్రి : వూ. అనండిసార్....ఒప్పేసుకోండి...

రమణ : మీరెలాగూ భార్య నుంచి విడాకులు తీసుకుంటున్నారుగా... కామాక్షిని మీరు చేసుకోండి...అనుభవం కల మనిషి ..అన్నివిధాలా సుఖ పెడుతుంది. పెన్షన్ ప్రాబ్లం తీరిపోతుంది...

ఖాన్ : ఏంటీ ? ఈ ముసిలాడు భార్యని వదిలేసాడా ? ఏరా ? ( దుర్గారావు ప్రవేశం )

దుర్గారావు : ఇరవై ఏళ్ళు కాపురం చేసి, బయట తిరుగుళ్ళకి అలవాటుపడి, నీకిదేం రోగం అని అడిగిందని వదిలేసి, పెన్షన్ గురించి ఈ నాటకం ఆడాడు.

ఖాన్ : ఏరా ?

గోవిందరాజులు : ఏరానా ?

ఖాన్ : ఆడదాన్ని మోసం చేసిన వాడ్ని ఏరా అనక గౌరవనీయులైన గోవిందరాజులు అనాలా ....ఇప్పుడు చెప్పు ఫోటో దిగినందుకు ఫాతిమాని చేసుకుంటావా ? క్షమించమని భార్యని ఏలుకుంటావా ? పది నిమిషాలు టైమిస్తున్నా...ఆలోచించి చెప్పు.

రమణ : ఖాన్‌గారూ చాలా రీజనబుల్‌గా మాట్లాడారు

కామాక్షి : త్వరగా చెప్పండి....మీరు మీ భార్యని తెచ్చుకుంటే కామాక్షిని...కాదంటే అనార్కలిని.....

సలీం : మీటరు తిరిగిపోతోంది. ఎవరు నా వైఫ్ ?

రమణ : బాబాయిగారు పెద్దవాళ్ళు. వయస్సుకు తగ్గ మనసుతో ఆలోచించండి. ఎంతయినా భార్య భార్యే...కంటికి రెప్ప, ఇంటికి ప్రహరీ కాళ్ళ కింది నేల, కట్టుకున్న భార్య ఇవే మగాళ్ళను కాపాడేవి. ధైర్యానిచ్చేవి. నా మాట వినండి.

దుర్గారావు : పగలు, రాత్రి కన్నీరు, మున్నీరుగా ఏడుస్తూ ఇప్పటికీ నిన్నే తల్చుకుంటోంది.

శివశంకరశాస్త్రి : సార్ ! చిన్నవాడ్ని. అయినా చెప్పాలనిపించి చెప్తున్నాను...ఊ అనండి ...ప్లీజ్ సార్....

రమణ : బాబాయిగారు...ఈసారికి ఇలా కానివ్వండి....

గోవిందరాజులు : అవునయ్యా...చాలా తప్పు చేశాను. కళ్ళు మూసుకుపోయి కలిసి బతికిన మనిషిని కాదన్నాను. రేయ్ దుర్గారావు. వెళదాం పద. క్షమార్పణ అడిగి గౌరవంగా మీ అక్కయ్యని తన ఇంటికి రమ్మని ఆహ్వానిద్దాం.

దుర్గారావు : థాంక్స్ బావా !....

రమణ : థాంక్స్ అండ్ కంగ్రాట్స్ బాబాయ్‌గారు....

కామాక్షి : అయితే నేను కామాక్షినేగా...

సలీం : ఫాతిమా....

ఫాతిమా : సలీం...

ఖాన్ : వెరీగుడ్. ప్రాబ్లం సాల్వైపోయింది. రండి పోదాం.

శివశంకరశాస్త్రి : సార్... ఆ ఫోటోలు ...నెగిటివ్స్ ...

ఖాన్ : ఫోటోలా ఎవడ్రా ఫోటో తీసింది అస్సలు ఫోటో రానేలేదు.

అంతా : ఆ...

అందరూ ఆశ్చర్యం